క్లుప్తంగా

రుణాలతో స్వయం ఉపాధి



రుణాల పొందిన వారిని అభినందిస్తున్న ఆర్‌ఎం

పలమనేరు: రుణాలతో స్వయం ఉపాధి పొంది, ఆర్థికంగా ముందుకుపోవాలని ఎస్‌బీఐ రీజినల్ మేనేజర్ వాణి కిశోర్‌కుమార్‌రెడ్డి అన్నారు. మండలంలోని బయ్యప్పగారిపల్లె పంచాయతీలోని 30 స్వయం సహాయక సంఘాలకు రుణాల రూపేణా రూ.5.12కోట్లను బుధవారం పంపిణీ చేశారు. ఆర్‌ఎంతోపాటు స్థానిక బ్రాంచిమేనేజర్ హరిప్రసాద్ మాట్లాడారు. బ్యాంకుల రుణాలను సభ్యులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కుటీర పరిశ్రమల ఏర్పాటుకుగాను మహిళా గ్రూపులకు రూ.20 లక్షల దాకా రుణం ఇస్తున్నట్టు చెప్పారు. మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ బాలాజీ నాయుడు మాట్లాడుతూ, రుణాలతో పాడి ఆవులను కొని అభివృద్ధి చెందాలని, సకాలంలో రుణాలు తిరిగి చెల్లించాలన్నారు. కార్యక్రమంలో ఎఫ్ఓ రాఘవేంద్ర, వినాయక, ఏపీఎం మొగిలి, సీసీ హరి, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

హుండీ ఆదాయం రూ.74వేలు



చౌడేపల్లె: స్థానిక శ్రీ అభీష్టద మృత్యుంజయేశ్వరస్వామి ఆలయంలో బుధవారం నిర్వహించిన హుండీ ఆదాయం లెక్కింపులో రూ.74,186 ఆదాయం సమకూరినట్లు ఈఓ కమలాకర్ తెలిపారు. లెక్కింపులో దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ కిరణ్ కుమార్‌రెడ్డి, గ్రామ పెద్దలు, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

మద్యం కేసులో నిందితుడి అరెస్ట్

సోమల: మద్యం కేసులో నిందితుడిని అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ వెంకట నరసింహులు బుధవారం తెలిపారు. ఎస్‌ఐ కథనం..ఆవులపల్లెకు చెందిన నాగరాజ ఈ నెల 6న గ్రామంలో కర్ణాటక మద్యం విక్రయిస్తూ పోలీసులను చూసి పారిపోయాడు. ఈ నేపథ్యంలో అతడు గ్రామానికి వచ్చినట్లు తెలుసుకుని దాడి చేశారు. నాగరాజును అరెస్ట్ చేసి అతని నుంచి 37 మద్యం టెట్రా ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి రిమాండ్ నిమిత్తం పుంగనూరు కోర్టుకు తరలించారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ దేవరాజులు పాల్గొన్నారు.

కూర్మాయి ఉప ఆరోగ్య కేంద్రం తనిఖీ

పలమనేరు: మండలంలోని కూర్మాయి ఉప ఆరోగ్య కేంద్రాన్ని మండల ఆరోగ్య విస్తరణ అధికారి జయశంకర్ బుధవారం తనిఖీ చేశారు. రిజిస్టర్లను పరిశీలించారు. వ్యాధి నిరోధక టీకాలు వేస్తున్నారా, లేదా? అని ఆరా తీశారు. గర్భవతులు, బాలింతలకు అందుతున్న సేవలను చూశారు. మాతా–శిశు మరణాలు లేకుండా చూడాలని అక్కడి సిబ్బందికి సూచించారు.

మమ్మల్ని పర్మినెంట్ చేయరూ!

- పంచాయతీ కార్మికుల వినతి



ఎంపీడీఓకు వినతి పత్రం ఇస్తున్న కార్మికులు

పెద్దపంజాణి: తమను పర్మినెంటు చేయాలని కోరుతూ మండలంలోని పలు గ్రామ పంచాయతీల కార్మికులు బుధవారం ఎంపీడీఓ భాస్కర్‌కు వినతి పత్రం ఇచ్చారు. వారు మాట్లాడుతూ, తమను ఉద్యోగులుగా గుర్తించి ప్రభుత్వం ఈఎస్‌ఐ, పీఎఫ్ వంటి సౌకర్యాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. గ్రీన్ అంబాసిడర్లకు రూ 10 వేల గౌరవ వేతనం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో చలపతి, నాగరాజ, జానకిరామయ్య, భూలక్ష్మమ్మ పాల్గొన్నారు.

సర్పంచుల సంఘ అధ్యక్షుడికి మాతృ వియోగం

పలమనేరు: మండల సర్పంచుల సంఘ అధ్యక్షులు నక్కపల్లి విశ్వనాథరెడ్డి తల్లి మల్లక్క(78) అనారోగ్యంతో మంగళవారం రాత్రి మృతి చెందింది. ఆమె అంత్యక్రియలు నక్కపల్లెలో బుధవారం నిర్వహించారు. జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, ఏఎంసీ చైర్మన్ హేమంత్‌కుమార్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి రంగన్న, కన్వీనర్ బాలాజీ నాయుడు, వైస్ ఎంపీపీ గజేంద్ర, మండలంలోని పలువురు సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఐటీఐ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

శాంతిపురం: అబకలదొడ్డి వద్ద ఉన్న ప్రభుత్వ ఐటీఐలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ జి.నగేష్ తెలిపారు. ఇప్పటికే రెండు విడతల ప్రవేశాలు పూర్తి కాగా, మిగిలిన కొన్ని సీట్ల భర్తీ కోసం ప్రభుత్వ ఆదేశాల మేరకు మళ్లీ దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 27లోపు వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకుని 28వ తేదీ 9గంటలలోపు ఒరిజినల్ సర్టిఫికెట్లను ఐటీఐలో చూపించాల్సి ఉంటుందని, ఆ తర్వాత 30న కౌన్సెలింగ్ ఉంటుందన్నారు.

మిన్నంటిన చంద్రయాన్-3 సంబరాలు



రొంపిచెర్లలో సంబరాలు చేసుకుంటున్న ప్రజలు



వీ.కోటలో..



పలమనేరులో మిఠాయిలు తినిపిస్తూ..

వి.కోట/పలమనేరు/రొంపిచెర్ల: యావత్ దేశంతో పాటు ప్రపంచదేశాలు ఆసక్తిగా చూసిన ఇస్రో చేపట్టిన చంద్రయాన్-3 ల్యాండర్ సాఫ్ట్ ల్యాండింగ్ ప్రక్రియ విజయవంతం కావడంతో ప్రజలు సంబరాలు చేసుకున్నారు. బుధవారం సాయంత్రం వి.కోట, పలమనేరు, రొంపిచెర్లలో ప్రజలు టపాకాయలు పేల్చి, మిఠాయిలు పంచిపెడుతూ.. భారత్ మాతాకీ జై అంటూ నినాదాలు చేశారు. జాతీయ పతాకంతో చేతపట్టి జయహో భారత్ అంటూ కేరింతలు కొట్టారు. సాయంత్రం ల్యాండింగ్ ప్రత్యక్ష ప్రసారాన్ని టీవీలు, స్మార్ట్‌ఫోన్లలో పట్టణవాసులు వీక్షించారు. జాబిల్లిలోని దక్షిణ ధ్రువంపై సాఫ్ట్ ల్యాండింగ్ ప్రక్రియను ఉత్కంఠభరితంగా చూశారు. ఇది జయప్రదం కావడంతో భారత్ సరికొత్త చరిత్ర సృష్టించిందంటూ ఆనందోత్సాహంతో గంతులేశారు. వాట్సాప్‌లో సందేశాలు, వీడియోలను షేర్ చేసుకున్నారు. ఈ వేర్వేరు కార్యక్రమాల్లో వీ.కోట ఎంపీపీ యువరాజు, వైస్ ఎంపీపీ తమీమ్ ఖాన్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సలీంబాషా, జాకీర్ హూసేన్, గురు, కిషోర్, అబూబకర్, నేమిచంద్‌పటేల్, రాజాసాహెబ్, నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

అభివృద్ధిలో ఆదర్శంగా నిలుద్దాం



మాట్లాడుతున్న జెడ్పీటీసీ సభ్యుడు దామోదరరాజు, పక్కన ఎంపీపీ

చౌడేపల్లె: గ్రామస్థాయి నుంచి ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేసి మండలాభివృద్ధిలో ఆదర్శంగా నిలుద్దామంటూ జెడ్పీటీసీ సభ్యుడు దామోదరరాజు అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ రామమూర్తి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి చొరవతో కోట్లాది రూపాయలతో పలు అభివృద్ధి పనులు మంజూరు చేయించారన్నారు. కొన్ని పనులు పూర్తి చేశారని, మరి కొన్ని మధ్యలోనే నిలిపివేశాన్నారు. వీటిని పూర్తి చేసి, మంత్రి చేతుల మీదుగా ప్రారంభోత్సవాలకు సిద్ధం చేయాలని కోరారు. తాగునీటి ఎద్దడి గ్రామాల్లో అవసరమైన చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. రైతులకు కొత్తపంటల సాగు విధానంపై అవగాహన కల్పించి అధిక దిగుబడులు సాధించేలా చూడాలన్నారు. అనంతరం శాఖల వారీగా అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్షించారు. సమావేశంలో వైస్ ఎంపీపీలు సుధాకర్‌రెడ్డి, నరసింహులు యాదవ్, సింగిల్‌విండో చైర్మన్ రవిచంద్రారెడ్డి, కో–ఆప్షన్ మెంబరు సాధిక్, పీఆర్ ఈఈ చంద్రశేఖర్‌రెడ్డి, డీఈఈ ప్రసాద్, ఎంపీడీఓ సుధాకర్, తహసీల్దార్ మాధవరాజు తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు పంపిణీ



సీఎం రిలీఫ్ పండ్ చెక్కును అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి

చౌడేపల్లె: ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కును వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి బుధవారం చౌడేపల్లెలో పంపిణీ చేశారు. వివరాలు.. 29–ఏ చింతమాకులపల్లెకు చెందిన బి.రెడ్డెప్ప అనారోగ్యానికి గురై ఆర్థిక సహాయం కోసం మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి వినతి పత్రం ఇచ్చారు. దీనిపై స్పందించిన మంత్రి సీఎం సహాయనిధి నుంచి రూ.27 వేలను మంజూరు చేయించారు. కష్టకాలంలో ఆర్థికంగా ఆదుకున్న ప్రభుత్వానికి, మంత్రికి రెడ్డెప్ప కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు దామోదరరాజు, ఎంపీపీ రామమూర్తి, వైస్ ఎంపీపీలు నరసింహులు యాదవ్, సుధాకర్‌రెడ్డి, సర్పంచ్ హైమావతి పాల్గొన్నారు.

దొంగ ఓట్లను తొలగించండి : ఎంపీపీ



ఓటర్ల జాబితాలో మార్పులు–చేర్పులపై మాట్లాడుతున్న ఎంపీపీ పురుషోత్తం రెడ్డి

రొంపిచెర్ల: ఓటర్ల జాబితాలో దొంగ ఓట్లను తొలగించాలని ఎంపీపీ చిచ్చిలి పురుషోత్తం రెడ్డి ఆదేశించారు. ఓటర్ల జాబితాలో మార్పులు–చేర్పులపై బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అధికారులు, ప్రజాప్రతినిధులతో ఎంపీపీ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, మండలంలోని బొమ్మయ్యగారిపల్లె, మోటుమల్లెల, గానుగచింత గ్రామ పంచాయతీలలో చాలా దొంగ ఓట్లు ఉన్నాయని అన్నారు. ఒకే ఓటు రెండు పోలింగ్ కేంద్రాలలో ఉన్నాయని, వీటిని గుర్తించి ఒక చోట మాత్రమే ఉంచి, మరో చోట ఓటును తొలగించాలని అధికారులకు సూచించారు. ప్రజాప్రతినిధులు దొంగ ఓట్లను గుర్తించి బీఎల్‌ఓల దృష్టికి తీసుకువెళ్లాలన్నారు. పోలింగ్ బూత్‌లలో దొంగ ఓట్లు, రెండు చోట్ల ఓట్లు ఉంటే బీఎల్‌ఓలే బాధ్యత వహించాలని, దీనిని దృష్టిలో ఉంచుకుని పారబాట్లకు తావివ్వకుండా ఓటర్ల జాబితాను సమగ్రంగా తయారు చేయాలన్నారు. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యుడు రెడ్డీశ్వర్ రెడ్డి, డీటీ వెంకటరమణారెడ్డి, వైస్ ఎంపీపీ విజయశేఖర్, సర్పంచులు జీవలత, నాగిరెడ్డి, అన్సర్‌బాషా పాల్గొన్నారు.

టెర్రకోట హస్తకళాకారులకు సన్మానం



సన్మానం అందుకున్న హస్త కళాకారులు

పలమనేరు: స్వాతంత్ర్యదిన వేడుకల సందర్భంగా ప్రధాన మంత్రి నరేంద్రమోదీ కార్యాలయ ఆహ్వానంతో ఎర్రకోటలో జరిగిన వేడుకలకు హాజరైన పలమనేరు టెర్రకోట హస్తకళాకారులు కుమ్మరి ఎల్లప్ప, మురళమ్మ దంపతులను రాష్ట్ర కుమ్మరి సంఘ నేతలు టెర్రకోట కాలనీలో బుధవారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో స్థానిక టెర్రకోట కళాకారులు పాల్గొన్నారు.

కల్యాణం.. కమనీయం

బైరెడ్డిపల్లె: మండలంలోని గౌనితిమ్మేపల్లె శ్రీరామ భజన మందిరంలో బుధవారం శ్రీ సీతారామ కల్యాణోత్సవం కనుల పండువగా నిర్వహించారు. సీతారామ లక్ష్మణ ఉత్సవమూర్తులను వివిధ రకాల పుష్పాలతో అలంకరించిన కల్యాణవేదికపై కొలువుదీర్చారు. మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, వేద పండితుల మంత్రోచ్ఛరణ నడుమ కల్యాణోత్సవం చేశారు. రఘుపతిగౌడు కుటుంబీకులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. భక్తులకు రామకృష్ణమాచార్యులు తీర్థప్రసాదాలను అందజేశారు.

చెరువుల అభివృద్ధి పనులపై సమీక్ష

చౌడేపల్లె: ఇరిగేషన్ శాఖ, ఉపాధి హామీ సంయుక్త నిధులతో మంజూరైన చెరువుల అభివృద్ధి పనులపై ఎంపీపీ రామమూర్తి సమీక్షించారు. బుధవారం తన చాంబర్‌లో ఆయన వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు దామోదరరాజుతో కలిసి అధికారులు, ప్రజాప్రతినిధులు, కాంట్రాక్టర్ల సమావేశం నిర్వహించారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి చొరవతో మండలంలో చెరువుల అభివృద్ధికి రూ.1.60 కోట్లు కేటాయించారని, వీటితో పాటు అదనంగా మరో రూ.60 లక్షలు కేటాయించినట్లు చెప్పారు. పనులు వెంటనే ప్రారంభించి పూర్తి చేయాలన్నారు. వర్షాలు కురవకముందే కట్టల బలోపేతం, తూము, మొరవ పనులు పూర్తిచేసేలా చూడాలని అధికారులకు ఆదేశించారు. సిమెంటురోడ్లు, మురుగు కాలువలు, భవన నిర్మాణ పనులు, నాడు–నేడుతో పాటు వివిధ శాఖల సమన్వయంతో చేస్తున్న పనులపై సమీక్షించారు. సమావేశంలో సర్పంచులు, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీలో సుందరీకరణ పనులు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వెంకటరెడ్డి యాదవ్

పుంగనూరు: మున్సిపాలిటి పరిధిలో అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ద్వారా కోట్లాది రూపాయలతో సుందరీకరణ పనులు చేస్తున్నట్టు పీకేఎం ఉడా చైర్మన్ వెంకటరెడ్డి యాదవ్ తెలిపారు. బుధవారం మున్సిపాలిటీలో చైర్మన్ అలీమ్‌బాషా, కమిషనర్ నరసింహప్రసాద్‌రెడ్డి, జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ అమ్ము తో కలసి విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి ఆయన మాట్లాడారు. పట్టణంలోని ఎన్ఎస్.పేటలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న పార్కుకు రూ.50 లక్షలు కేటాయించి, లైట్లు, బెంచీలు, పూల మొక్కలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. అలాగే భీమగానిపల్లె బైపాస్ సర్కిల్‌లో నూతనంగా ఏర్పాటు చేస్తున్న శ్రీకృష్ణదేవరాయుల విగ్రహం వద్ద, అలాగే అరబిక్ కాలేజ్ వద్ద ఏర్పాటు చేస్తున్న అల్లూరి సీతారామరాజు విగ్రహం వద్ద ఎల్‌ఈడీ లైట్లు, పూల మొక్కల ఏర్పాటు, సుందరీకరణ పనులకు రూ.25 లక్షలు కేటాయించామన్నారు. యూఎస్ఆర్ సర్కిల్‌ను రూ.6 లక్షలతో సుందరీకరించామన్నారు. పట్టణంలోని పీఎల్ఆర్ మినీ బైపాస్ రోడ్డులో మొక్కలు ఏర్పాటు చేసి, ఎల్‌ఈడీ రోప్ లైట్లు సుమారు రూ.10 లక్షలతో ఏర్పాటు చేశామన్నారు. వీటితో పాటు పట్టణంలో ఉన్న ఎంబీటి రోడ్డు విస్తరణ పనులలో సుమారు మూడు కిలోమీటర్లు డివైడర్లు ఏర్పాటు చేసి, ఎల్‌ఈడీ లైట్లు, మొక్కలు ఏర్పాటు చేస్తామన్నారు. అంబేద్కర్ సర్కిల్ నుంచి ఇందిరా సర్కిల్, తూర్పు మొగశాల సర్కిల్‌లో ఐమాక్స్ లైట్లు సుమారు రూ.20 లక్షలతో ఏర్పాటు చేస్తామన్నారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ వెంకటమిథున్‌రెడ్డి కృషితో ఇవన్నీ చేస్తున్నట్టు చెప్పారు. సమావేశంలో డీఈఈ మహేష్, ఏఈ కృష్ణకుమార్, సచివాలయాల కన్వీనర్ వరదారెడ్డి పాల్గొన్నారు.

ప్రతిభావంతులకు నగదు ప్రోత్సాహకాలు



నగదు ప్రోత్సాహకాలు అందుకున్న విద్యార్థినులు

పలమనేరు: పట్టణంలోని జెడ్పీ హైస్కూల్‌లో గత ఏడాడి ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు స్థానిక కెనరా బ్యాంకు మేనేజర్ సుబ్రమణ్యం బుధవారం నగదు ప్రోత్సాహకాలను పంపిణీ చేశారు. 5, 6, 7 తరగతుల్లో ఎక్కువ మార్కులు పొందిన వారికి రూ.2500 చొప్పున అలాగే 8,9,10 తరగతుల విద్యార్థులకు రూ.5వేల చొప్పున ఆరుగురు విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో ఎంఈఓలు లీలారాణి, బాలసుందరం, అసిస్టెంట్ మేనేజర్ మదన్, పాఠశాల హెచ్‌ఎం లత పాల్గొన్నారు.

ఘనంగా టంగుటూరి జయంతి



సోమల: టంగుటూరి చిత్రపటం ముందు నివాళులర్పిస్తున్న ఇన్‌చార్జ్ ప్రిన్సిపల్, అధ్యాపకులు, విద్యార్థులు



పులిచెర్లలో..



పలమనేరులో..

సోమల: స్థానిక ఎస్‌కేవీఎస్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో టంగుటూరి ప్రకాశం పంతులు 152 జయంతి వేడుకలను బుధవారం ఎన్ఎస్ఎస్ విభాగం ఘనంగా నిర్వహించింది. ఇన్‌చార్జ్ ప్రిన్సిపల్ జయరాం, అధ్యాపకులు టంగుటూరు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. టంగుటూరి సేవలను ప్రిన్సిపల్ కీర్తించారు. తెలుగు ప్రజల గుండెల్లో చిరస్మరణీయంగా నిలిచిన వ్యక్తి టంగుటూరి ప్రకాశం పంతులని కొనియాడారు. అధ్యాపకులు గౌతమ్, శివయ్య, సత్యనారాయణ, సుధ, గీత, నాగరత్నమ్మ, పుష్పకుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

పులిచెర్లలో..

పులిచెర్ల(కల్లూరు): ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి వేడుకలను బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఎంపీపీ సురేంద్రనాథరెడ్డి ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఇన్‌చార్జ్ ఎంపీడీఓ రాజశేఖర్, ఎంఈఓ సిద్ధరామయ్య , కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పలమనేరులో..

పలమనేరు: టంగుటూరి ప్రకాశం పంతులు 152వ జయంతిని పట్టణంలోని కళామందిరంలో స్థానిక తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి బుధవారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సమితి అధ్యక్షులు తులసీనాథం నాయుడు మాట్లాడుతూ, ఉమ్మడి ఆంధ్ర రాష్ట్రానికి తొలి ముఖ్యమంత్రిగా ఆయన చేసిన సేవలు ఘనమైనవన్నారు. ఎన్నో కష్టాలను ఎదుర్కొని గొప్ప న్యాయవాదిగా, ఆపై రాజకీయ నాయకునిగా ఆయన ఎదిగారని, ఆయనను స్ఫూర్తిగా తీసుకుని యువత పయనించాలన్నారు. కార్యక్రమంలో సుదర్శనాచారి, పుష్ప, శివశంకర్ రెడ్డి, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా సామాజిక తనిఖీ

పులిచెర్ల(కల్లూరు): మండలంలో ఉపాధి హామీ పనులను సామాజిక తనిఖీ బృందం పరిశీలించాలని ఎంపీపీ సురేంద్రనాధరెడ్డి తెలిపారు. మండలంలో బుధవారం ఎర్రపాపిరెడ్డిగారిపల్లె, 106 రామిరెడ్డిగారిపల్లె, రాజులపల్లె, పాతపేట, రేణుమాకులపల్లెలో గ్రామసభలు నిర్వహించారు. ఏపీఓ షౌకత్‌అలీ, ఎస్ఆర్‌పీ రాజు, డీఆర్‌పీ నరేష్, ఈసీ క్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

గెస్ట్ లెక్చరర్ల పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

పలమనేరు: పట్టణంలోని శ్రీవర్రచెన్నారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రసాయన శాస్త్రం, చరిత్ర సబ్జెక్టులకు సంబంధించి అతిథి అధ్యాపకుల పోస్టుకు దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వెంకటేశులు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. పీజీ 55 శాతం మార్కులతో పూర్తి చేసి నెట్/స్లెట్, పీహెచ్‌డీ చేసిన వారికి ఈ నియామకాల్లో ప్రాధాన్యత ఉంటుందని అన్నారు. శనివారం లోపు దరఖాస్తులను కళాశాల పనివేళల్లో సమర్పించాలన్నారు.

విద్యతోనే సమాజాభివృద్ధి



సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు

- జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు

పలమనేరు: విద్యతోనే సమాజం అభివృద్ధి చెందుతుందని భావించి విద్యకు పెద్దపీట వేసిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి దక్కుతుందని జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు అన్నారు. స్థానిక ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలకు పట్టణానికి చెందిన రాజేష్, విద్యాసాగర్, పళని కంప్యూటర్, మైక్ సెట్, కలర్ ప్రింటర్లను బుధవారం విరాళంగా అందజేశారు. ముఖ్య అతిథిగా జెడ్పీ చైర్మన్ మాట్లాడారు. తాము చదువుకొనే రోజుల్లో పాడుబడిన పెంకుల తరగతి గదుల్లో అరకొర సౌకర్యాల మధ్య చదువుకున్నామని, అంతేకాకుండా యూనిఫామ్, పుస్తకాలు మొదలైనవన్నీ తామే కొనుక్కోవాల్సి వచ్చేదని జ్ఞాపకాలు గుర్తు చేసుకున్నారు. కానీ ఇప్పుడా పరిస్థితులు లేవని, పిల్లలకు మనమిచ్చే పెద్ద ఆస్తి చదువు మాత్రమేనని భావించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్కూళ్లను కోట్లాది రూపాయలతో అభివృద్ధి చేసి, కార్పొరేట్ స్కూళ్ల కంటే మిన్నగా తీర్చిదిద్దారని నాడు–నేడుతో రూపురేఖలు మారిన బడుల గురించి చెప్పారు. ఇక్కడి విద్యా విధానాన్ని చూసి దేశంలోని పలు రాష్ట్రాలు ప్రశంసించి, అవి కూడా మన విద్యా విధానాలను అనుసరిస్తున్నాయన్నారు. దాతలు కూడా స్పందించి తమ స్కూళ్లకు తమవంతు తోడ్పాటు ఇవ్వడం అభినందనీయమని, సీఎం, దాతల నమ్మకాని వమ్ము చేయకుండా విద్యార్థులు బాగా చదివి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ హేమంత్‌కుమార్ రెడ్డి, టీచర్లు, విద్యార్థినులు పాల్గొన్నారు.

పెద్దినేపల్లెకు తీరనున్న తాగునీటి సమస్య

గంగవరం: మండలంలోని పత్తికొండ పంచాయతీ పెద్దినేపల్లెకు తాగునీటి సమస్యపై జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు స్పందించారు. సమస్యను గతంలో మండల వైఎస్సార్‌సీపీ నేతలు ఏఎంసీ డైరెక్టర్ సిద్దప్పతో కలిసి ఎమ్మెల్యే వెంకటేగౌడ జెడ్పీ చైర్మన్ దృష్టికి తీసుకెళ్లారు. అలాగే ఇటీవలే సాక్షి దినపత్రిక సైతం తాగునీటి సమస్యపై కథనం ప్రచురించింది. స్పందించిన జెడ్పీ చైర్మన్ రూ. 2.5 లక్షలతో నూతన నీటి బోరుకు నిధులు మంజూరు చేశారు. మంజూరు పత్రాన్ని జెడ్పీ కార్యాలయంలో ఏఎంసీ డైరెక్టర్ సిద్దప్పకు అందజేశారు. బుధవారం గ్రామంలో బోరు వేసేందుకు ప్రజాప్రతినిధులు, నాయకులు కలిసి భూమిపూజ చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ మోహన్ రెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ ప్రహ్లాద, సర్పంచ్ రవినాయుడు, ఎంపీటీసీ సూరిబాబు, నాయకులు చంద్రప్ప, శ్రీరాములురెడ్డి, చలపతిరెడ్డి, గిరిరాజారెడ్డి పాల్గొన్నారు.

పాల బిల్లులపై మహిళా రైతులకు రుణాలు



మాట్లాడుతున్న ఎంపీపీ యువరాజు

వి.కోట: అమూల్ డెయిరీకి పాలు పోస్తే మహిళా రైతులకు వెలుగు సంఘాల ద్వారా డీసీసీ బ్యాంకు రుణాలు ఇస్తుందని ఎంపీపీ యువరాజు అన్నారు. బుధవారం మండలంలోని చింతమాకులపల్లె గ్రామ సచివాలయం వద్ద జగనన్న పాలవెల్లువలో భాగంగా మహిళా రైతులకు డీసీసీ బ్యాంకు సౌజన్యంతో రుణమేళా నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎంపీపీ మాట్లాడారు. పాల బిల్లు బట్టి రుణం ఇవ్వడం మహిళలకు వరమన్నారు. మహిళా రైతులు ప్రైవేటు సంస్థల్లో మోసపోకుండా, ప్రభుత్వం అండతో నడుస్తున్న అమూల్ డెయిరీకి పాలు పోసి ఆర్థికంగా అభివృద్ధి చెందాలని కోరారు. అలాగే ప్రభుత్వం గడ్డి కత్తిరించే యంత్రాన్ని సబ్సిడీపై కేవలం 20,382 రూపాయలకే ఇస్తోందని, దీనిని పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో అమూల్ డెయిరీ అధికారులు, పశు వైద్యాధికారిణి పావని, ఏపీఎం సుబ్రమణ్యం, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నకిలీ పట్టాలతో ఇళ్ల నిర్మాణం!



హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తున్న అధికారులు

రామకుప్పం: మండలంలో నకిలీ పట్టాలపై అధికారులు దృష్టి సారించారు. నకిలీ పట్టాలకు చెక్ పెట్టాలని మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సాధారణ సర్వ సభ్య సమావేశంలో సభ్యులు డిమాండ్ చేశారు. ప్రధానంగా బల్ల, విజలాపురం, రామకుప్పం రాజుపేట గ్రామాల్లో నకిలీ పట్టాలు ఎక్కువగా ఉన్నాయని సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. ఈ నేపథ్యంలో విజలాపురం గ్రామ పంచాయతీ సంతమిట్ట వద్ద నకిలీ పట్టాలతో ఇళ్లను నిర్మిస్తున్నట్టు బుధవారం రెవెన్యూ అధికారులకు సమాచారం అందింది. దీంతో తహసీల్దార్ మురళి సిబ్బందితో ఆ ప్రాంతానికి వెళ్లారు. ఇంటి నిర్మాణం చేస్తున్న స్థలాన్ని పరిశీలించారు. దీనిపై విచారణ చేయాలని వీఆర్వో, సర్వేయర్లను తహసీల్దారు ఆదేశించారు. అలాగే, ప్రభుత్వ స్థలంలో ఇంటి నిర్మాణాలకు పూనుకోరాదని హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు.

రాయితీపై ఉలవ విత్తనాలు పంపిణీ



చౌడేపల్లె : ఉలవ విత్తనాలను పంపిణీ చేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

చౌడేపల్లె: వేరుశనగ పంట సాగుచేయని రైతుల కోసం ప్రభుత్వం 80 శాతం రాయితీపై ఉలవ విత్తనాలను పంపిణీ చేస్తోందని, దీనిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయశాఖ ఏడీఏ శివకుమార్ కోరారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి, ప్రజాప్రతినిధులతో కలిసి రైతులకు విత్తనాలను ఆయన పంపిణీ చేసి మాట్లాడారు. మండలానికి 154 క్వింటాళ్ల ఉలవల విత్తనాలు అందుబాటులో ఉన్నాయని, 10 కేజీల ప్యాకెట్ ధర 80 శాతం రాయితీ పోను రూ.216కు ఇస్తున్నామని, ఒక ఎకరాలో సాగు చేయడానికి ఈ విత్తనాలు సరిపోతాయన్నారు. ఇవి కావలసిన రైతులు సంబంధిత రైతు భరోసా కేంద్రాల్లో పాస్ పుస్తకం, ఆధార్ కార్డును తీసుకెళ్లి బయోమెట్రిక్ నమోదు చేసి పొందవచ్చన్నారు. వర్షాలు అదునుగా కురుస్తున్నాయని, ఉలవలు సాగు చేయాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో జెడ్పిటీసీ సభ్యుడు దామోదరరాజు, ఎంపీపీ రామమూర్తి, మాజీ ఎంపీపీ రుక్మిణమ్మ, వైస్ ఎంపీపీ సుధాకర్ రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ రవిచంద్రారెడ్డి, డీసీసీబి డైరెక్టర్ రమేష్‌బాబు, ఎంపీడీఓ సుధాకర్, ఏఓ జ్యోతమ్మ, ఏవీఏ నవీన్‌కుమార్ పాల్గొన్నారు.

80 శాతం రాయితీపై ఉలవలు

పుంగనూరు: పుంగనూరు వ్యవసాయ డివిజన్ పరిధిలోని 8 మండలాల రైతులకు 80 శాతం రాయితీపై ఉలవ విత్తనాలు పంపిణీ చేయనున్నట్లు ఏడీఏ శివకుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వర్షాల కారణంగా వేరుశనగ పంట సాగు చేయని రైతులు ప్రత్యామ్నాయంగా ఉలవలు సాగు చేయడానికి ప్రభుత్వం ప్రోత్సహిస్తోందన్నారు. ఎకరాకు పదికేజీల ఉలవలు పంపిణీ చేస్తామన్నారు. ఉలవలు క్వింటాల్ ధర రూ.10,800 ఉందన్నారు. ప్రభుత్వం రాయితీ రూ.8,640 పోను రూ.2,160లకు ఇస్తోందన్నారు. ఆగస్టు , సెప్టెంబర్ నెలలో ఉలవ సాగుకు అనుకూల పరిస్థితులు ఉంటాయని, ఈ పంట సాగుతో భూమి సారవంతమవుతుందని, పశువులకు దాణాగా ఎంతో ఉపయోగపడుతుందని తెలియజేశారు.

మండలానికి 127క్వింటాళ్ల ఉలవలు

పులిచెర్ల (కల్లూరు): మండలానికి 127 క్వింటాళ్ల ఉలవలు వచ్చాయని మండల వ్యవసాయశాఖాధికారి శ్రీనివాసులు తెలిపారు. సబ్సిడీ ధరకు వీటిని రైతులకు ఇస్తామని, ఇవి కావలసినవారు ఆర్‌బీకేలలో నమోదు చేసుకోవాలని తెలిపారు.

పలమనేరు వ్యవసాయశాఖ డివిజన్‌కు..

పలమనేరు: ఈ ఖరీఫ్ సీజన్‌లో వర్షపాతం తగ్గడంతో ప్రభుత్వం రైతులకు 80శాతం సబ్సిడీతో ఉలవ విత్తనాలను పంపిణీ చేస్తోందని స్థానిక వ్యవసాయశాఖ ఏడీ అన్నపూర్ణదేవి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. డివిజన్‌లో పలమనేరు మండలానికి 130 క్వింటాళ్లు, బైరెడ్డిపల్లెకు 247 క్వింటాళ్లు, శాంతిపురం 112, కుప్పం151, వీ.కోట 121, రామకుప్పం 140, గుడుపల్లె మండలానికి 94 క్వింటాళ్లను ఇవ్వనుందని తెలిపారు. అవసరమైన రైతులు ఆర్‌బీకేలలో నమోదు చేసుకోవాలని సూచించారు.

నేటి నుంచి ఆర్బీకేలలో..

సోమల: మండలంలోని రైతు భరోసా కేంద్రాల్లో గురువారం నుంచి ఉలవలు పంపిణీ చేయనున్నట్టు వ్యవసాయాధికారి సుధాకర్ ఓ ప్రకటనలో తెలిపారు.